




# మనం

## నల్లగొండ

సూర్యాపేట, యాదాద్రి భువనగిరి

ఆదివారం | 14 | జూన్ | 2026 | పేజీలు 6 | www.manamepaper.com


## బత్తాయి సాగులో జిల్లాను దేశంలోనే

# ముందు స్థానంలో ఉంచుతాం

- రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుంది
- పంట మార్పిడిపై రైతులు దృష్టి పెట్టాలి
- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి



**రైతుల ఐక్యత, పరస్పర సహకారం, ప్రభుత్వ మద్దతుతో నల్గొండ జిల్లాను బత్తాయి సాగులో దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎలిమినేటి మాధవరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సిట్రస్ సెమినార్ కు ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికై అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని అన్నారు.**

నల్లగొండ-జూన్ 13( మనం ప్రతినిధి) : నల్గొండ పేరు వినగానే బత్తాయి గుర్తుకొస్తుందని, జిల్లాలో గతంలో 4 లక్షల ఎకరాల బత్తాయి సాగు కాగా, కాలక్రమేనా వివిధ కారణాలవల్ల అది 40 వేల ఎకరాలకు తగ్గడం బాధాకరమన్నారు. అయితే మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా రైతులు కూడా మారాల్సిన అవసరం ఉందని, ఎప్పుడు వరిపైనే ఆధారపడకుండా బత్తాయి లాంటి పంటలు, ఇతర ఉద్యాన పంటలను సాగు చేయాలన్నారు. పంట మార్పిడిపై తప్పనిసరి దృష్టి సారించాలని ,ఈ విషయంలో రైతులకు ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రాష్ట్ర



# ఇష్టా రాజ్యం!

## కోదాడ మున్సిపాలిటీలో విచిత్ర పరిస్థితి

- ప్రభుత్వం మారినా కాంట్రాక్టర్ మాత్రం మారడా?
- పెద్దవాగు పూడికతీత పనుల్లో భారీ అక్రమాల ఆరోపణలు
- నేనే రాజు... నేనే మంత్రి
- అన్న చందంగా కోదాడలో ఒకే కాంట్రాక్టర్ పెత్తనం!
- గుత్తేదారుని మాట... మున్సిపల్ సిబ్బందికి శాసనం
- అధికారుల మౌనం వెనుక మర్మమేంటి?

**ప్రభుత్వాలు మారి.. నూతన ప్రభుత్వం ఏర్పడుతుంది.. అదేవిధంగా క్రింది స్థాయిలో.. ప్రజాప్రతినిధులు పదవి కాలం సైతం ముగుస్తుంది.. నూతన పాలకవర్గం కొలువు తీరుతుంది... అయినా గాని.. కోదాడలో ఒక కాంట్రాక్టర్ ఆధిపత్యం మచ్చుకైనా తగ్గడం లేదు..ఏమాత్రం మారడం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో కీలక కాంట్రాక్టులు దక్కించుకున్న అదే వ్యక్తి, ప్రస్తుత సర్కార్ లోను చక్రం తిప్పుతూ కోట్ల రూపాయల పనులను గుప్పెట్లో పెట్టుకుంటున్నాడని ఆరోపణలు గుప్పుమంటున్నాయి.. ఈ గుత్తేదారుడు కోదాడ మున్సిపాలిటీలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని సదరు మున్సిపల్ సిబ్బందితో పాటు.. స్థానికులు చర్చించుకోవడం గమనార్హం.**

కోదాడ, జూన్ 13 :(మనం న్యూస్): ప్రస్తుతం కోదాడ పెద్దవాగు పూడికతీత పనుల్లో జరుగుతున్న తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాగులో నుంచి తొలగించిన పూడికను శాస్త్రీయంగా తరలించాల్సిన చోట, అదే మట్టి కొద్దిరోజుల క్రితం తీసిన మట్టిని అదే వాగు పక్కనే పోసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేపు వర్షాలు వస్తే ఆ మట్టంతా మళ్లీ వాగులోకే చేరి పూడికతీత పనులు చేసిన

- మిగతా 2లో..

# మన బడి బస్సులు భద్రమేనా?

- నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బస్సులు
- ఫిట్నెస్ లేకున్నా రోడ్లపైకి వాహనాలు
- నామమాత్రంగా రక్షణ చర్యలు




నల్లగొండ- జూన్ 13( మనం ప్రతినిధి) : మన స్కూల్ బస్సు లు ఫిట్నెస్ గా ఉన్నాయా లేవా అనే అనుమానం తరచుగా కలుగుతూనే ఉంటుంది. విద్యాసంస్థల బస్సుల్లో యాజమాన్యాలు విద్యార్థుల భద్రతను గాలికొదిలేస్తున్నాయి. ఫిట్నెస్ లేని బస్సులు నడుపుతూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. విద్యా సంస్థల బస్సుల్లో పిల్లల రక్షణకు

- మిగతా 2లో..

# ఇష్టా...రాజ్యం!

మొదటి పేజీ తరువాయి

ప్రయోజనం లేకుండా పోతుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు.. అంతేకాదు... ప్రభుత్వ పనుల, పూడిక పేరుతో తీసిన మట్టిని ప్రైవేట్ ప్లాట్లు, గృహ నిర్మాణాలకు విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు కూడా గుట్టే దారుడు పై లేకపోలేదు.. ప్రజల అంచనా ప్రకారం ఇప్పటివరకు చాలా ట్రాక్టర్ల ట్రిప్పుల మట్టి తరలించబడిందని, అందులో మొత్తం భాగం అమ్మకాలకే వెళ్లిందని అంటున్నారు. ఇంత పెద్ద ఎత్తున వ్యవహారం సాగుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం కళ్లు మూసుకుని కూర్చోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పనుల నాణ్యతను పరిశీలించాల్సిన అధికారులు ఎక్కడ? ప్రభుత్వ ఆస్తి దుర్వినియోగ మవుతుంటే బాధ్యత వహించాల్సిన అధికారులు ఎందుకు స్పందించడం లేదు? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ప్రజాధనంతో చేపట్టిన పనులను కొందరి వ్యక్తిగత ఆదాయ వనరుగా మార్చుకోవడం ఎంతవరకు సమంజసం? ప్రభుత్వం ఎవరిదైనా సరే కాంట్రాక్టులు మాత్రం ఒకరికే కావడం వెనుక ఉన్న శక్తులు ఎవరు? అనే చర్చ ఇప్పుడు కోదాడలో హాట్ టాపిక్‌గా మారింది. నిన్న నిర్వహించిన కోదాడ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులపై జరిగిన చర్చ రసాభాసగా మారటం మరుసటి రోజే పూడికతీత పనుల్లో దుర్వినియోగం జరగడంపై పట్టణంలో చర్చ నీ అంశంగా మారింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పెద్దవాగు పూడికతీత పనులపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు బయటపడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ప్రజాధనం దోపిడీకి పాల్పడిన వారితో పాటు చూసీచూడనట్టు వ్యవహరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజల డిమాండ్ చేస్తున్నారు.

# మన బడి బస్సులు భద్రమేనా?

మొదటి పేజీ తరువాయి

సంబంధించి చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఫిట్నెస్ తనిఖీ సమయాల్లో నిబంధనలు పాటిస్తున్నప్పటికీ, ఆ తరువాత పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. జూన్ 15 నుంచి నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానుండగా, ఆ లోపే విద్యాసంస్థల బస్సుల ఫిట్నెస్ ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి ఉంది. మూడు రోజులుగా ఆర్టీఏ అధికారులు బస్సుల తనిఖీలు చేపడుతుండగా, యాజమాన్యాల నుంచి సరియైన స్పందన లభించడంలేదు. జిల్లావ్యాప్తంగా 800 వరకు విద్యాసంస్థల బస్సులు ఉండగా, ఇప్పటి వరకు కేవలం 383 బస్సులకు మాత్రమే ఫిట్నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. ఫిట్నెస్ పరీక్షలకు వెళితే అధికారులు బస్సులను సీజ్ చేస్తారేమోనని ఉద్దేశంతోనే వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల తనిఖీల్లో అనేక బస్సుల్లో లోపాలు బయటపడుతుండటం గమనార్హం.

**బడి బస్సులు ఫిట్నెస్ గా ఉన్నాయా?**

బస్సులకు తప్పనిసరిగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. ముఖ్యంగా పాఠశాలల బస్సుల్లో ప్రయాణించేది చిన్నపిల్లలు కావడంతో బస్సు కదిలేటప్పుడు కిటికీల నుంచి చేతులు బయటకు చాచకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. గ్రిల్స్ లేని కారణంగా ప్రయాణ సమయంలో విద్యార్థులు చేతులు బయట పెట్టిన పక్షంలో ఇతర వాహనాల ద్వారా ప్రమాదం జరిగే అవకాశం ఎంతైనా ఉంది.

**బస్సుల్లో అనుకోని ప్రమాదం జరిగితే ఎలా?**

అనుకోని పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం సంభవించి బస్సు లో మంటలు చెలరేగిన పక్షంలో వాటిని ఆర్పేందుకు ఫైర్ ఎస్టింగిషర్లు అందుబాటులో ఉండాలి. అగ్నిమాపక శాఖ నుంచి అను మతి తీసుకొని బస్సుల్లో ఫైర్ ఎస్టింగిషర్లు ఏర్పాటు చేయాలి. అయితే బస్సుల్లో ఫైర్ ఎస్టింగిషర్స్ కనిపిస్తున్నప్పటికీ, నామ మాత్రంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. అత్యవసర సమయాల్లో అవి పని చేస్తాయో.. లేదో కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయి.

**ప్రథమ చికిత్స డబ్బాలో కానరాని పరికరాలు.**

విద్యాసంస్థల బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ అందులో ప్రథమ చికిత్సకు సంబంధించి ఎలాంటి పరికరాలు ఉండటం లేదని తెలుస్తోంది. ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో తప్పనిసరిగా కాటన్, అయోడిన్, స్పిరిట్ బాటిల్, బ్యాండేజ్ ఉండాలనే నిబంధన ఉంది. బస్సుల్లో తదితర వస్తువులు ఉన్న ప్పటికీ అవి కాలం చెల్లి ఉండటం గమనార్హం. చిన్నచిన్న ప్రమాదాలు జరిగినప్పుడు విద్యార్థులకు ప్రథమ చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉపయోగపడతాయి. వీటితో పాటు విద్యార్థులు బ్యాగులు పెట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. డ్రైవరుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఫోటో పేరు, సెల్ నంబర్ విధిగా ప్రదర్శించాలనే నిబంధన ఉంది.

**ఊసేలేని డ్రైవర్ల మెడికల్ సర్టిఫికెట్లు**

పాఠశాల బస్సుల్లో పనిచేసే డ్రైవర్లకు రెండు సంవత్సరాలకు ఒకసారి వైద్య చికిత్సలు చేయించి మెడికల్ సర్టిఫికెట్ అందుబాటులో ఉంచాలి. కాని ఈ విషయంపై యాజమాన్యాలు దృష్టి సారించడంలేదని సమాచారం. డ్రైవర్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు యాజమాన్యాలు ధ్రువీకరించుకోవాల్సిన అవసరం ఉంటుంది. అలాగే హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి ఐదు సంవత్సరాల అనుభవం ఉన్న వారినే డ్రైవర్లుగా నియమించుకోవాలనే నిబంధన కూడా ఉంది. లైట్లు, హ్యాండ్ బ్రేక్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సు, పసుపుపచ్చ రంగు కలిగి ఉండాలి.

**బస్సులపై కఠిన చర్యలు**

విద్యా సంస్థలు పునః ప్రారంభమవుతున్న నేప థ్యంలో విద్యాసంస్థల బస్సులు తప్పనిసరిగా ఫిట్నెస్ పరీక్షలు చేయించుకోవాలి. ఫిట్నెస్ సర్టిఫికెట్ లేని బస్సుల్లో విద్యార్థులను తీసుకెళ్లే వాహనాలను సీజ్ చేసి, యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు చేపడతాం. ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులు రోడ్లపైకి రావొద్దు. ఒకవేళ వస్తే వాటిని సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

**– డాక్టర్ ఎన్ వాణి , డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్**

# బత్తాయి సాగులో జిల్లాను దేశంలోనే ముందు స్థానంలో ఉంచుతాం

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం వివిధ పంటలు సాగుచేసే రైతులకు సహకారం అందిస్తున్నదని, ముఖ్యంగా వరి పండించిన రైతులకు మద్దతు ధర కల్పించడమే కాకుండా, 500 రూపాయల బోనస్ ఇచ్చి సన్నధాన్యాన్ని కొనుగోలు చేస్తుదన్నారు. అయితే బత్తాయికి పేరు ప్రఖ్యాతులుగాంచిన నల్గొండ జిల్లాలో తిరిగి బత్తాయిని ఎక్కువ మొత్తంలో సాగు చేయాల్సిన అవసరం ఉందని, బత్తాయి ఆరోగ్య పరంగా కూడా మనిషికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉద్యాన పంటల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి అంతర్జాతీయ స్థాయి ఫ్రూట్ మార్కెట్ కు శంకుస్థాపన చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రైతులు పంట మార్పిడితోపాటు, ఉద్యాన పంటలను సాగు చేయాలని, నల్గొండ జిల్లాలో బత్తాయి సాగుకు పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమానికి హాజరైన పరిగి శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ బత్తాయిలో అనేక కొత్త రకం వంగడాలు వచ్చాయని, రైతులకు ఇవి ప్రయోజనకరంగా ఉంటాయని, ముందు నుండి నల్గొండ బత్తాయికి ఎంతో పేరు ప్రఖ్యాతలు పొందిందని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా, రైతు బీమా, మహిళలకు రుణాలు తదితర సౌకర్యాలను కల్పిస్తున్నదన్నారు. అనంతరం రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, నల్గొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ చైర్మన్ అమిత్ రెడ్డి, తదితరులు మాట్లాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డి. రాజి రెడ్డి, రైతు కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి, చెవిటి వెంకన్న, పావని రెడ్డి, ఉద్యాన శాఖ రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లాల అధికారులు, అభ్యుదయ రైతులు, బత్తాయి రైతులు, తదితరులు పాల్గొన్నారు. ఆడిటోరియం ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను మంత్రి ప్రారంభించారు.

## అకాల వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ



నాగారం జూన్ 13, మనం న్యూస్ : నాగారం మండల ప్రజలు అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ ఐ చిరంజీవి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో రానున్న రెండు రోజుల్లో ఉరుములు మెరుపుల తో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారని తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటికి రావద్దని సూచించారు. ప్రజలందరూ అధికారుల సూచనలు మరియు వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించాలి అని కోరారు. నీటితో నిండిన రహదారులు వాగులు కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దని అన్నారు. ఉరుములు మెరుపుల సంభవించే సమయంలో చెట్ల కింద నిలబడవద్దని దగ్గర్లోని సురక్షిత ప్రాంతంలోకి వెళ్లాలని అన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.



## గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయం

జాజిరెడ్డిగూడెం, జూన్ 13(మనం న్యూస్) : గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ధరూరి యోగానంద చార్యులు అన్నారు. జాజిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ ఆవాస గ్రామం తుంగగూడెం గొల్లగూడెంలో గ్రామ పంచాయతీ పాలక మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు . గ్రామాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం వచ్చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపాక సత్యం , మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శిగ నసీర్ గౌడ్, జాజిరెడ్డిగూడెం సర్పంచ్ బింగి కృష్ణమూర్తి, కాసర్లపాడ్ సర్పంచ్ మంచాల లలిత రాంమూర్తి , జాజిరెడ్డిగూడెం ఉప సర్పంచ్ కమటం స్వర్ణలత రాజు, వార్డు మెంబర్లు మండల ప్రవీణ్, వల్లాల ఖాజా ,బొల్లం సైదులు, నోముల స్వాతి నరేష్ ,మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మామిడి అనిల్ , అర్వపల్లి దేవస్థాన ధర్మకర్త జెగ్రిపోతుల సోమయ్య సీనియర్ నాయకులు మధు సందీప్ సతీష్ రవి మహేష్ దడిగా బిక్షం దడిగా మల్లేష్ పరిపాటి వీరయ్య కోడి ముత్యాలి బినబోయిన లింగయ్య బద్రి వెంకన్న శ్రీను దడిగా లింగయ్య పరిపాటి రాజు సతీష్ గ్రామస్థులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## పీహెచ్సీలో వైద్యురాలి ప్రసవం

### హర్షం వ్యక్తం చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెన్‌పహాడ్ జూన్ 13 (మనం న్యూస్):మండల పరిధిలోని అనాజిపురం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎం ఎల్ హెచ్ పి)గా విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు చిప్పలపల్లి అనూష శనివారం ఉదయం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పిహెచ్సీ) ప్రసవించి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దారావత్ రాజేష్ నాయక్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జననం అనంతరం బిడ్డకు అందించాల్సిన తొలి టీకాలు (బర్త్ డోస్) అందజేసి తల్లిపాలను (బ్రెస్ట్ ఫీడింగ్) ఇప్పించినట్లు తెలిపారు తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని డాక్టర్ వెల్లడించారు డాక్టర్ అనూష భర్త డాక్టర్ డి. కార్తీక్ కూడా నల్గొండ జిల్లా పాములపాడు పీహెచ్సీ పరిధిలోని ఆగమోత్కూరు సబ్‌సెంటర్‌లో ఎం ఎల్ హెచ్ పి గా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు స్థానిక ప్రజలే కాకుండా వైద్య సిబ్బంది కూడా స్థానిక ఆసుపత్రిలో ప్రసవం జరిపించుకోవడంతో పెన్‌పహాడ్, పాములపాడు ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది, సహోద్యోగులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.



## పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక

సూర్యాపేట టౌన్, జూన్ 12, మనం న్యూస్: పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ నూతన జిల్లా కార్యవర్గ ఎన్నికను శనివారం పట్టణంలోని పద్మశాలి భవనంలో చేపట్టారు. జిల్లా అధ్యక్షులు గొగుల నాగరాజు, కార్యదర్శి కొప్పుల బక్కయ్య, ఉపాధ్యక్షులు ఎన్ గంగరాజు, నరేందర్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు శేరిక, సంయుక్త కార్యదర్శులు రావుల నరేందర్, గుగులోతు రమేష్, సింగం శ్రీధర్, జేషన్ రాజ్, నిర్వహణ కార్యదర్శులు ఎస్ కె సోందు, నెహ్రూ, కోశాధికారి సంతోష్, మీడియా కన్వీనర్ మధు, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కృషి చేస్తానని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



## పబ్లిక్ టాయిలెట్ నిర్మాణానికి శంకుస్థాపన

### స్వచ్ఛభారత్ నిధులతో పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

నేరేడుచర్ల జూన్ 13 మనం న్యూస్ : నేరేడుచర్ల పురపాలక ప్రజల అవసర నిమిత్తం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణం నందు పబ్లిక్ టాయిలెట్ నిర్మించేందుకు మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకటరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. స్వచ్ఛభారత్ మిషన్ నుండి 10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చన్నబోయిన నాగరాజు వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి, కౌన్సిలర్లు యార వ లక్ష్మి ఇంజమూరి శ్రీకాంత్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి, జడ్.పి.హెచ్.ఎస్ హెడ్మాస్టర్ బట్టు మధు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా మాది

### ఇంటింటి ప్రచారం చేసిన జడ్.పి.హెచ్.ఎస్ ఉపాధ్యాయ బృందం

నేరేడుచర్ల జూన్ 13 మనం న్యూస్ : విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా మాది అంటూ నేరేడుచర్ల పట్టణ పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు నేతృత్వంలో ఆచార్య జయశంకర్ బడిబాట ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నేరేడుచర్ల మున్సిపాలిటీ ఆవాస ప్రాంతాల్లో నిర్వహించారు కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కౌన్సిలర్లు ఇంజమూరి శ్రీకాంత్,యారవ లక్ష్మి మాట్లాడుతూ నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సదుపాయాలు సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని, సద్వినియోగం చేసుకునేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం సైదులు రషీద్ ఖాన్ ఎం నాగమణి లాల్ సాహెబ్ పి శ్రీను స్థానికులు గజ్జల కోటేశ్వరరావు,మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంఘ బంధం అంగన్వాడి సెంటర్ నిర్మాణాలకు శంకుస్థాపన

### 22 లక్షల ఎన్ఆర్జిఎస్ నిధులతో పనులు ప్రారంభం



నేరేడుచర్ల జూన్ 13 మనం న్యూస్ : నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో సంఘ బంధం భవనం అంగన్వాడి కేంద్రం నిర్మాణాలకు రాష్ట్ర భారీ నీటి పారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో MGN-REGS 22 లక్షల రూపాయల నిధులతో ఏర్పాటు చేయుటకు శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకట్ రెడ్డి ఎంపీడీవో, ఎంపీ ఓ శంకుస్థాపన చేశారు. మేడారం గ్రామ సర్పంచ్ పారేపల్లి సత్యనారాయణ, కల్లూరు సర్పంచ్ చలసాని మంజుల శ్రీనివాసరావు,మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా రామారావు,మేడారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట కృష్ణారావు,జీల చెరువు చైర్మన్ మామిడి వెంకటేశ్వర్లు,నేరేడుచర్ల మార్కెట్ చైర్మన్ విజయలక్ష్మి నరసింహులు వైస్ చైర్మన్ తాళ్లూరు సురేష్, గ్రామ కాంగ్రెస్ నాయకులు కర్ణం రామానర్సు, పళ్ళ అంజయ్య, గొట్టెముక్కుల ముక్కంటి, సోం వెంకటి, కటికోలా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందించిన పూర్వ విద్యార్థులు

కోదాడ//నడిగూడెం, జూన్ 13(మనం న్యూస్): 2005వ సంవత్సరంలో పదవ తరగతి తామంతా కలసి 20 సంవత్సరాల క్రితం చదువుకున్న తమ తోటి మిత్రుడు మండల కేంద్రానికి చెందిన కుంభం సాయిలు ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబానికి తామంతా ఉన్నామనే భరోసా కల్పించిన 2005వ సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు. వారి కుటుంబం ఆర్థిక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకొని తమ వంతు సహాయంగా 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో 2005 పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు



## గంజా నిర్మూలనే లక్ష్యంగా నార్కోటి డాగ్ రోలెక్స్ తనిఖీలు



పాలకీడు జూన్ 13 (మనం న్యూస్) : జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది శనివారం పాలకవీడు మండల కేంద్రంలో శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై కొటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలన గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో మండల కేంద్రంలో హోటల్స్, టీ దుకాణాలు, మెడికల్ దుకాణాలు, కూరగాయల దుకాణాలు, పాటశాల ప్రాంగణాలు, సిమెంట్ ఫ్యాక్టరీ ట్రాన్స్పోర్ట్ అడ్డాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు, సోదాలు నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో గాంజాయి లాంటి మాదకద్రవ్యం మన యువతని సమాజాన్ని పట్టిపీడిస్తుందని దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉండాలని అన్నారు. దీనిలో భాగంగానే విస్తృత తనిఖీలు నిర్వహించామని. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని సూచించారు. ఎవరైనా గంజాయి ఉపయోగించేవారు ఉన్నా సరఫరా చేసేవారు ఉన్నా అలాంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మవారికి అధికమాసం వాయినాలు

చౌటుప్పల్, జూన్ 13(మనం న్యూస్) : చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో శనివారం పట్టణకేంద్రంలోని ఆర్యవైశ్య మహిళలు పురుషోత్తమ(అధిక) మాసం సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారికి అధిక మాస వాయినాలు అందించారు. ఈ సందర్భంగా వడి బియ్యం కార్యక్రమంతోపాటు సామూహిక లలిత సహస్ర నామ పారాయణం ఘనంగా నిర్వహించారు. పాడిపంటలతో దేశం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల కుసుమ, దీపిక, సింగిరికొండ శైలజ, దాచేపల్లి నాగమణి, రమాదేవి, లక్ష్మీ, యమున, ప్రసన్న, తేలుకుంట్ల వసంత, బూర్గు నాగమణి, కామిశెట్టి శ్రీదేవి, సముద్రాల పుష్పమ్మ, వాణి, పావని, పద్మ, స్వాతి, ఆలయ పూజారి పెద్ది కృష్ణకిశోర్‌శర్మ, రోహిత్ మిశ్రా పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి సన్మానం



చౌటుప్పల్, జూన్ 13(మనం న్యూస్) : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఉబ్బు వెంకటయ్యతో కలిసి చౌటుప్పల్ మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షునిగా ఎన్నికైన కాసర్ల శ్రీనివాస్‌రెడ్డిలు హైద్రాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషిచేయాలని సూచించారు.

## చౌటుప్పల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

### సీపీఐ(ఎం) మండలకార్యదర్శి గంగదేవి సైదులు



చౌటుప్పల్, జూన్ 13(మనం న్యూస్) : చౌటుప్పల్ మండలాన్ని వ్యవసాయం, విద్య, వైద్యం, పరిశ్రమలు, ఉపాధి, మౌలిక సదుపాయాల రంగాల్లో సమగ్ర అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) మండలకార్యదర్శి గంగదేవి సైదులు కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చౌటుప్పల్ మండలం రాష్ట్రంలో కీలక ప్రాంతంగా ఎదుగుతున్నప్పటికీ అభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రణాళికలు తగిన స్థాయిలో అమలుకావడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రయినేజీ, తాగునీటి సౌకర్యం, విద్యుత్తు సరఫరా మెరుగుపర్చాలని కోరారు. వ్యవసాయరంగాన్ని బలోపేతం చేసేందుకు రైతులకు సాగునీటి వసతులు కల్పించడంతోపాటు వ్యవసాయ కార్మికులకు ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగేలా కొత్త పరిశ్రమలు ఏర్పాటుచేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. మహిళలు, యువత, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలుచేయాలని తెలిపారు. మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు.

## ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షునిగా బొమ్మకంటి కిశోర్‌కుమార్



చౌటుప్పల్, జూన్ 13(మనం న్యూస్) : చౌటుప్పల్ మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షునిగా బొమ్మకంటి కిశోర్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మండలపరిధిలోని కొయ్యలగూడెం గ్రామంలోని రిక్కల సత్తిరెడ్డి గార్డెన్స్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు సుర్కంటి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలకమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా మీసాల నర్సింహ, ఉపాధ్యక్షునిగా జెల్ల పవన్‌కుమార్, బాతరాజు ధనుంజయ, పల్చం జయమ్మ, ప్రధాకార్య దర్శిగా బోయ సదానందం, కార్యదర్శిగా శ్యామల చిరంజీవి, కార్యనిర్వహణ అధ్యక్షునిగా కందగట్ల సురేందర్‌రెడ్డి, సహాయకార్యదర్శులుగా నిమ్మల సత్యనారాయణ, ముద్దం రమేశ్‌యాదవ్, కోశాధికారిగా వలందాసు మహేశ్‌గౌడ్, గౌరవ సలహాదారులుగా పినింటి శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పునూతల నర్సింహ, సుర్కంటి ప్రభాకర్‌రెడ్డి, పక్కీరు శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా బోయిని లింగస్వామియాదవ్, గడ్డం సత్తయ్య, పెరుమాండ్ల లింగస్వామి, బకనగారి శ్రావణ్‌కుమార్‌గౌడ్, సామిడి శ్రీనివాస్‌రెడ్డి, సుర్కంటి అనుపురెడ్డి, డి.రాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రేపటి పౌరులపై ఇంతటి దారుణమా?



సూర్యాపేట టౌన్, జూన్ 12, మనం న్యూస్: వేసవి సెలవులు కావడంతో ఖమ్మం జిల్లా రాపర్తినగర్ లో ఓ అపార్ట్మెంట్ లో వాచ్ మెన్ గా పని చేస్తున్న తాతాయ్య వద్దకు వచ్చిన 12 ఏళ్ళ బాలిక పై అదే అపార్ట్మెంట్ లో ఉండే లారీ డ్రైవర్ మహ్మద్ గౌస్ పాషా కన్ను పడి, అమాయకురాలైన బాలికకు మాయమాటలు చెప్పి 4వ అంతస్తుకు తీసుకువెళ్ళి మానవ మృగంగా మారి అఘాయిత్యం చేయబోగా ప్రతిఘటించిన బాలికను అక్కడి నుంచి తోసి వేసి హత్య చేయబోయిన క్రూరుడిని అత్యంత కఠినంగా శిక్షించి, ప్రాణాలతో బయటపడిన బాలికకు మెరుగైన వైద్యంతో పాటు ఆమె కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని జిల్లా రజక సంఘం నాయకులు అక్కినపల్లి జానయ్య విజ్ఞప్తి చేశారు. నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ షాక్ తో గేదె మృతి

### 50వేల ఆస్తి నష్టం



పెన్ పహాడ్ జూన్ 13 (మనం న్యూస్): ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్కు గుర్తై గేదె మృతి చెంది సుమారు 50వేల ఆస్తి నష్టం జరిగిన సంఘటన మండల పరిధిలోని న్యూ బంజారా హిల్స్ గ్రామపంచాయతీ ఆవాస గ్రామం ఎల్లప్ప కుంట తండాలో శనివారం చోటుచేసుకుంది బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామానికి చెందిన గుగులోతు మున్యా తన గేదెను మేత కోసం విడిచిపెట్టగా పక్క గ్రామమైన సీతమ్మ తండా శివారులో శుక్రవారం రాత్రి వీచిన గాలి దుమారానికి వ్యవసాయ మోటార్లకు సరఫరా జరిగే విద్యుత్ లైన్ తెగి పడిపోవడంతో మేతకు వెళ్ళిన గేదకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది కాగా విద్యుత్ అధికారులు గమనించక వారి నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తనకు విద్యుత్ అధికారులు, ప్రభుత్వం న్యాయం చేసి నష్ట పరిహారం అందించాలని బాధితులు, గ్రామస్తులు



## ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థుల అధ్యయనం

చౌటుప్పల్, జూన్ 13(మనం న్యూస్) : చౌటుప్పల్ మండలపరిధిలోని కొయ్యలగూడెం గ్రామాన్ని అర్నిత ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్ కళాశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. ప్రకృతి రంగులతో చేనేత వస్త్రాలను ఉత్పత్తి చేసే దుద్యాల శంకర్‌తో కలిసి చేనేత వస్త్రాలకు రంగులు, డిజైన్లు వేసే పద్ధతిని అధ్యయనం చేశారు. పోచంపల్లి పేరుతో ఖ్యాతిగాంచిన ఇక్కత్ డిజైన్ల ప్రత్యేకతను ఆ డిజైన్లు తయారుచేసే విధానాన్ని పరిశీలించారు. చేనేత కళను సాంప్రదాయాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని స్థానిక చేనేత కళాకారుల ద్వారా తెలుసుకున్నారు.



## ఉద్యోగ దరఖాస్తుల ప్రాసెసింగ్ ఫీజు తగ్గించాలి : డీవైఎఫ్ఐ

చౌటుప్పల్, జూన్ 13(మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ దరఖాస్తుల ప్రాసెసింగ్ ఫీజులు పెంచడం వల్ల తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు పడుతుందని, పెంచిన ఉద్యోగ దరఖాస్తుల ఫీజులను తగ్గించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లె మధుకృష్ణ, గడ్డం వెంకటేశ్ డిమాండ్‌చేశారు. శనివారం పట్టణకేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా ఊరట కలిగించకుండా ఉద్యోగ దరఖాస్తు ఫీజును రూ.200 నుండి రూ.1000కి పెంచడం నిరుద్యోగులపై మరింత భారం మోపినట్టేనని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే అనేక మంది నిరుద్యోగులు హాస్టళ్లలో ఉంటూ ప్రయివేట్ సంస్థల్లో కోచింగ్ తీసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఒకేసారి ఫీజులు పెంచడం ద్వారా ఒక నిరుద్యోగు నాలుగు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే నాలుగువేల రూపాయలు దరఖాస్తుకే వెచ్చించాల్సి వస్తుందని తెలిపారు. వెంటనే పెంచిన ఫీజులను వెనక్కు తీసుకొని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్‌డి.సలీమ్, సహాయకార్యదర్శి ఎమ్‌డి.ఖయ్యూమ్, జిల్లా కమిటీ సభ్యులు బండారు శ్రావణ్, రత్నం శ్రీకాంత్, పల్లె శివ పాల్గొన్నారు.

## 33 వాయినాలు సమర్పణ

సూర్యాపేట టౌన్, జూన్ 12, మనం న్యూస్: పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో శనివారం పార్వతీ పరమేశ్వరుల కళ్యాణాన్ని పురస్కరించుకుని అధిక జ్యేష్ఠ మాస సందర్భంగా వివిధ రకాల తో 33 శాల్తీలతో వాయినాలను అమ్మవారికి మహిళా భక్తులు అందించారు. ఈ సందర్భంగా సామూహిక లలితా సహస్రనామ పారాయణ అని నిర్వహించి, దేవాలయ ప్రధాన అర్చకులు శివరామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని కీర్తిస్తూ పాటలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ గౌరవ అధ్యక్షులు నుకా వెంకటేశం గుప్తా, అధ్యక్షులు బ్రాహ్మణపల్లి మురళీధర్, ప్రధాన కార్యదర్శి పబ్బ ప్రకాశరావు, కోశాధికారి కొత్త మల్లికార్జున్, కన్వీనర్ బోనగిరి విజయకుమార్, ఉపాధ్యక్షులు సోమ శ్రీశైలం, బెలిదే అశోక్, దేవరశెట్టి సోమయ్య, తాళ్లపల్లి రామయ్య, మహంకాళి ఉపేందర్, కమిటీ సభ్యులు కక్కిరేణి పద్మ, కర్నాటి సూర్య కళ, కొల్లూరు రత్నమాల, నూక ముత్యాలమ్మ, బ్రాహ్మణపల్లి నాగమణి, మహంకాళి కవిత దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే కుంభంని కలిసిన పోచంపల్లి కాంగ్రెస్ నాయకులు

**భారత లవ కుమార్ కి నియామక పత్రం అందజేత**



భూదాన్ పోచంపల్లి,జూన్ 12(మనం న్యూస్) : భూధాన్ పోచంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా భారత లవ కుమార్ ని మరొకసారి నియమించినం దుకు శనివారము భువనగిరి శాసనసభ్యు లు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా వారు కలిసి శాలువాతో సత్కరించారు.పోచంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా మరొకసారి నియమించినందుకు భారత లవ కుమార్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తన నియామక పత్రాన్ని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ రాఘవ రెడ్డి,మర్రి నరసింహారెడ్డి ,కొట్టం కరుణాకర్ రెడ్డి ,దారెడ్డి వేణుగోపాల్ రెడ్డి ,గోరంటి శ్రీనివాస్ రెడ్డి , సర్పంచ్ కాసుల అంజయ్య , మున్సిపల్ కౌన్సిలర్ సురపల్లి రాధిక రమేష్ ,రావుల జంగయ్య ,దేవరాయ కుమార్ , జినుకల లావణ్య యాదగిరి, సయ్యద్ ఎజాస్ ,తాటి నరసింహ ,వెంకటేశం ,జినుకల జయ సూర్య ,గంజి నరేందర్ ,వేణు గౌడ్ ,రాజు,పోచయ్య,శ్రీకాంత్ ,నాయకులు , తదితరులు పాల్గొన్నారు.



## 15న అర్వపల్లిలో బీఆర్ఎస్ బూత్ ఏజెంట్లు, సభ్యత్వ ఇంచార్జీల సమావేశం

తుంగతుర్తి, జూన్ 13,(మనం న్యూస్) : అర్వపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్లో ఈ నెల 15న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అధ్యక్షతన బీఆర్ఎస్ బూత్ లెవెల్ ఏజెంట్లు, డిజిటల్ సభ్యత్వ ఇంచార్జీల సమావేశం నిర్వహించనున్నట్లు బిఆర్ఎస్ పార్టీ తుంగతుర్తి మండల కమిటీ మాజీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయం లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అర్వపల్లి మండల కేంద్రంలో నిర్వహించే సమావేశానికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీష్ రెడ్డి, రాష్ట్ర బీఆర్ఎస్ కార్యదర్శి, సూర్యాపేట జిల్లా ఇన్చార్జి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, నియోజకవర్గ సభ్యత్వ ఇంచార్జీ యలగందుల వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి బూత్ ఏజెంట్లు, సభ్యత్వ ఇంచార్జీలు, సర్పంచ్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తప్పనిసరిగా పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శిస్తూ, పార్టీ బలోపేతానికి ఈ సమావేశం కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గుండగాని రాములు గౌడ్, వెంపటి గ్రామ సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య, గోపగాని రమేష్, శ్రీనివాస్,నాగమల్లు వెంకటేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మహిళా నాయకురాలి నామినేషన్ తిరస్కరణ దురదృష్టకరం

**కాంగ్రెస్ పార్టీ నాయకులు దాయం ఝాన్సీ రాజిరెడ్డి**



తుంగతుర్తి, జూన్ 13,(మనం న్యూస్) : మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ను తిరస్కరించడం బీజేపీ రాజకీయ కుట్రలకు పరాకాష్ట అని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు దాయం ఝాన్సీ రాజిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. బీజేపీ వరుసగా కుట్రలు చేస్తూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని అడ్డగోలుగా ఖూనీ చేస్తోందని మండిపడ్డారు. మొన్నటి వరకు కేవలం ఓట్ల చోరీకి పాల్పడిన ఆ పార్టీ ఇప్పుడు ఏకంగా సీట్ల చోరీకి కూడా దిగడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమన్నారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కోల్పోయి, బీజేపీ అనుబంధ సంఘంగా పనిచేస్తోందనే అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. మహిళల గౌరవం గురించి మాట్లాడే మహిళలకు రిజర్వేషన్లు చేయిస్తామని చెప్పి, "బేటి బచావో- బేటి పడావో" అని నినదించే బిజెపి ఒక మహిళా నాయకురాలి నామినేషన్ ను ఇలా తిరస్కరించడం నామినేషన్ను అత్యంత దురదృష్టకరమని అన్నారు.నిబద్ధత కలిగిన గాంధేయవాది, కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ను కుట్రపూరితంగా తిరస్కరించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని విమర్శించారు.

# బాధితులకు భరోసా.. పోలీస్ కర్తవ్యం

**పోలీసు అధికారుల నెలవారి సమీక్ష సమావేశంలో ఎస్పీ నర్సింహా**



సూర్యాపేట జూన్ 13 (మనం ప్రతినిధి) : బాధితులకు భరోసా భద్రత పోలీసుల లక్ష్యం అని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి తో కలిసి శనివారం జిల్లా పోలీసు అధికారుల నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని శాంతిభద్రతలు, కేసుల దర్యాప్తు పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించారు. గత నెలలో నమోదైన కేసుల పూర్వాపరాలను నిశితం గా పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించా రు. బాధితులకు తక్షణ భరోసా, రక్షణ కల్పించడమే పోలీస్ శాఖ ప్రథమ కర్తవ్యమని ఎస్పీ స్పష్టం చేశారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల పై పటిష్ట నిఘా ఉంచి నివారించాలని ఆదేశించారు. బాధితుల ఇంటి వద్ద నుండి కేసు నమోదు చేసే విషయంలో అలసత్వం వహించకూడదని డోర్ స్టెప్ ఎఫ్ఐఆర్ పటిష్టంగా అమలుచేయాలని సూచించారు. కేసుల ఛేదనలో శాస్త్ర సాంకేతిక నైపుణ్యాల తో పని చేయాలి, సాక్ష్యాధారాలను పక్కాగా నమోదు చేయాలి అన్నారు. సాక్షులను చైత న్య పరిచి, నేరస్థులకు త్వరితగతిన శిక్షలు పడేలా కోర్టు అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలి. ప్రజలు, బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను పెండింగ్లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలి, కేసుల సంఖ్యను తగ్గించేలా పనిచేయాలి. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు చేపట్టాలి. గ్రామాల్లో భద్రతా వలయాలు ఏర్పాటు చేయాలి. నేరాలు జరిగినప్పుడు పక్కా ఆధారాలు లభించేలా సీసీ కెమెరాల వ్యవస్థను బలోపేతం చేయాలి. స్థానిక ప్రజలు, వ్యాపారులు తమ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల పట్ల జాగ్రత్తలు, మహిళల భద్రత వంటి ముఖ్యాంశాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లాలోని కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, డిసిఆర్బి డీఎస్పీ రవి, ఏఆర్ డీఎస్పీ నరసింహా చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మగ్దూం అలీ, సిఐలు రాజశేఖర్, వెంకటయ్య, నాగేశ్వరరావు, శివ శంకర్, చరమందరాజు, రామకృష్ణ రెడ్డి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, సైబర్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఏసీ లు, సిబ్బంది పాల్గొన్నారు.





# ఘనంగా స్వామివారి కళ్యాణం

మేళ్ల చెరువు జూన్ 13 మనం న్యూస్ : మేళ్లచెరువులోని శ్రీ స్వయంభు శంభు లింగేశ్వరస్వామి దేవాలయంలో శనివారం శివపార్వతుల మాస కళ్యాణం ఆలయ అర్చకులు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఉదయం వేళలో మహన్యాస రుద్రాభిషేకం, కళ్యాణ అనంతరం నీరాజన మంత్రపుష్పం, తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కళ్యాణాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి నాగేళ్ల శంబిరెడ్డి,పాలకవర్గ మాజీ చైర్మన్ పెండ్లి లచ్చయ్య, ఆలయ అర్చకులు విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయ శర్మ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# ఆర్ అండ్‌బీ ఇంజినీర్లు అందుబాటులో ఉండాలి

**ఇబ్బందిగా మారే రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి**

**ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి**

**శని,ఆదివారాలు ఏమి లేవు.. అందరు ఫీల్డ్ లో ఉండాల్సిందే**


**మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**

**భారీ వర్షాల నేపథ్యంలో ఆర్అండ్‌బీ అధికారులను అలెర్ట్ చేసిన మంత్రి కోమటి రెడ్డి**



నలగొండ– జూన్ 12( మనం ప్రతినిధి) : రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ ఆర్ అండ్ బి అధికారులను అలెర్ట్ చేశారు. సి.ఈ నుండి ఏ.ఈ వరకు,పై స్థాయి నుండి కింద స్థాయి వరకు గల ఆర్ అండ్ బి ఇంజనీర్లు అందరు క్షేత్ర స్థాయిలో ఉండాలనీ తేల్చి చెప్పారు. భారీ వర్షాల వల్ల..వరదలతో ముందుగా ఇబ్బందిగా మారే రోడ్లు,బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలనీ,ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. రోడ్లు కోతకు గురైతే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ,పోలీసు,ఎలక్ట్రిసిటీ,ఇరిగేషన్ ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలనీ సూచించారు. శని,ఆదివారాలు అని సెలవులు ఏమి లేవనీ...అత్యవసరం అయితే తప్పా అందరు ఫీల్డ్ లో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఎర్రమంజిల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ సెంటర్ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు,బ్రిడ్జిల పరిస్థితి మానిటరింగ్ చేయాలనీ,రాష్ట్రంలోని అన్ని ఆర్ అండ్ బి డివిజన్ల వారిగా వివరాలు ఎప్పటికప్పుడు తనకు తెలపాలనీ ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.

# పీజీ తెలుగు పాఠ్యాంశాల్లో అలీ కవిత "పాన్ మరక"




నలగొండ –జులై 13 (మనం న్యూస్) : డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ తెలుగు మొదటి సంవత్సరం సెకండ్ సెమిస్టర్ ఆధునిక కవిత్వం పాఠ్యాంశాల్లో నల్లగొండ పట్టణంలోని మాన్యంచెల్క నివాసి అయిన అలీ రాసిన పాన్ మరక కవిత చోటుచేసుకుందని అకడమిక్ తెలుగు కౌన్సిలర్ కవి రచయిత పున్నమి అంజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు అలీ రాసిన పాన్ మరక కవితలో జీవం జీవితం ఉన్నదని అందుకే ఆయన కవితకు పీజీ తెలుగు పాఠ్యాంశాల్లో చోటు దక్కడం జిల్లాకే గర్వకారణం అని అన్నారు అలీతో పాటు ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఎన్ గోపి రాసిన 'రొట్టె' సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ రాసిన 'నాలుగో కన్ను'కవితలకు కూడా ఇందులో స్థానం కల్పించినందుకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# రైతులు ఆయిల్ పామ్ పంట వైపు మొగ్గు చూపాలి

**తెలంగాణ ఆయిల్ ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రవీణ్ రెడ్డి**

**మాధారం గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు**

**పాల్గొన్న ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు**



బీబీనగర్: జూన్ 13,(మనం న్యూస్) : రైతులు ఆయిల్ పామ్ పంట వైపు మొగ్గు చూపాలని తెలంగాణ ఆయిల్ ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రవీణ్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మాదారం గ్రామ పరిధిలో అనాజిపురానికి చెందిన రైతు గునుగుంట్ల నర్సింహ వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రవీణ్ రెడ్డి హాజరైై రైతులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. ప్రస్తుత వ్యవసాయ రంగంలో రైతులు డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ పంట వైపు మొగ్గు చూపాలని, కొత్తగా ఆయిల్ పామ్ సాగు చేయాలనుకునే రైతులకు దాని ప్రాముఖ్యతని క్లుప్తంగా వివరించారు. ఇప్పటికే సాగు చేస్తున్న రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ అధిక దిగుబడి మెలకువలు సూచించారు .ప్రస్తుత తరుణంలో అత్యధికముగా పండిస్తున్న వరి పంట తో పోల్చుకుంటే ఆయిల్ పామ్ సాగు కి అధిక డిమాండ్ ఉన్నందున రైతులు గమనించి, ఆలోచన చేసి ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి మరల్చాలని అదేవిధంగా ప్రభుత్వం అత్యధికముగా ప్రోత్సహకం కల్పిస్తున్న ఆయిల్ పామ్ సాగుకి సంబందిన సబ్సిడీ, పెట్టుబడి సహాయం గురించి వివరించారు. రైతులు 36 నెలల పాటు కష్టపడి సాగు చేస్తే ఆ తర్వాత 25 సంవత్సరాల పాటు మంచి దిగుబడితో అధిక లాభాలని పొందవచ్చని అన్నారు. ఆసక్తి గల రైతులు వెంటనే ఫీల్డ్ ఆఫిసర్ ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్స్ శిరీష, మౌనిక, మాదారం సర్పంచ్ మందడి వెంకట్ రెడ్డి, అనాజిపురం సర్పంచ్ సురేష్, రవిపహాడ్ తండా సర్పంచ్ శంకర్ నాయక్, గునుగుంట్ల శ్రీనివాస్, రవి శంకర్, ఆదర్శ రైతు అంజి రెడ్డి, ఆయా గ్రామాల రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# ఫోక్సో చట్టం ద్వారా నిందితుడిని కఠినంగా శిక్షించాలి

**రజక అభివృద్ధి సంస్థ జిల్లా అధ్యక్షులు చిలక రాజు సతీష్**

నల్లగొండ–జూన్ 12 (మనం న్యూస్) : ఖమ్మం జిల్లాలో 12 సంవత్సరాల రజక మైనర్ బాలికను అత్యాచారం చేసి అత్యాయత్నం చేసినటువంటి నిందితుడు గౌస్ పాషాను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా పోక్సో చట్టం ద్వారా నిందితుడిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ రజక అభివృద్ధి సంస్థ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు చిలకరాజు సతీష్ కుమార్ గారు నిరసన ర్యాలీ చేసినారు ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని ఒక అపార్ట్మెంట్లో రజక కుటుంబం వాచ్మెన్ గా పనిచేస్తూ ఉన్న సమయంలో 12 సంవత్సరాల మైనర్ బాలికను అదే అపార్ట్మెంట్లో ఉంటున్నటువంటి నిందితుడు గౌస్ పాషా మైనర్ బాలికను పిలిచి తన ఫ్లాట్ లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసి నాలుగో ఫ్లోర్ నుంచి తోసేసినటువంటి నిందితుడు గౌస్ పాషా గౌస్ పాషా ని కఠినంగా శిక్షించాలని అని అన్నారు అదేవిధంగా హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న మైనర్ బాలికను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైద్యం చేయించి ఆ కుటుంబానికి ఆర్థికంగా ఆదుకోవాలని అని అన్నారు అదేవిధంగా మళ్ళీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిందితుడు గౌస్ పాషా ని కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లుట్ల సైదులు ఊళ్లేందుల అంజయ్య జిల్లా కార్యదర్శి పగిళ్ళ వెంకన్న గారు జిల్లా నాయకులు చర్లపల్లి మల్లేశం గారు పట్టణ నాయకురాలు రేవెల్లి సునీత ,పట్టణ నాయకులు భీమనపల్లి శంకరయ్య, ఎల్లుట్ల రవి, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి సత్యనారాయణ గౌడ్ గారు జిల్లా నాయకులు జెనిగా లింగస్వామి యాదవ్ దొండ సాంబయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల స్వాగతానికి చందాపూర్ సిద్ధం

**పరిసరాల పరిశుభ్రత, తాగునీటి ట్యాంకుల శుద్ధీకరణ పూర్తి..**

**విద్యార్థులకు ఆరోగ్యకర వాతావరణం కల్పించడమే లక్ష్యం**

వనపర్తి, జూన్ 13 (మనం న్యూస్ ) : నూతన విద్యా సంవత్సరానికి ఘన స్వాగతం పలికేందుకు వనపర్తి మండలం లోని చందాపూర్ గ్రామ పంచాయతీ ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ నెల 15వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామ సర్పంచ్ బర్ల నిర్మల మహేందర్, ఉపసర్పంచ్ పుల్లరి నరేందర్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించేలా పాఠశాలల ఆవరణలను పూర్తిస్థాయిలో శుభ్రం చేశారు. గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది పాఠశాల ప్రాంగణాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, కలుపు మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. పాఠశాల భవనాల చుట్టూ ప్రత్యేక శుభ్రత చర్యలు చేపట్టి విద్యార్థులకు అనుకూల వాతావరణాన్ని కల్పించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. తాగునీటి పైప్‌లైన్‌కు కొత్త నల్లాలను అమర్చడంతో పాటు నీటి ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్‌తో శుద్ధి చేసి పరిశుభ్రం చేశారు. అనంతరం ట్యాంకులకు రంగులు వేయించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పాఠశాలలలో తాగునీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా తనిఖీ చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడం పట్ల గ్రామస్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# దోస్త్ మేరా దోస్త్!

**బాల్య మిత్రుడికి మాజీ మంత్రి పరామర్శ.**

వనపర్తి జూన్ 13 (మనం ప్రతినిధి) : ఆ ఇద్దరి పుట్టుకలు, కులాలు, మతాలు వేరు కానీ కలిసి తిరుగుతూ పెరగడమే కాకుండా కలిసి చదువుకొని ఒకరు రాజకీయాల్లో మంత్రి అయ్యారు. మరొకరు మతానికి ముస్లిం అయినప్పటికీ తెలుగులో చక్కటి వాక్చాతుర్యం కలిగిన మరొకరు సుదీర్ఘ కాలంగా క్రమశిక్షణతో కూడిన జర్నలిస్టుగా కొనసాగుతున్నారు. ఓ పక్క పేదరికం, మరోపక్క వయోభారంతో పాటు మోకాళ్ళ నొప్పులతో బాధపడుతూ ఇటీవల రోబోటిక్ సర్జరీ చేయించుకున్న విషయం తెలుసుకున్న ఆ బాల్య మిత్రుడు శనివారం ఆయన ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పరామర్శించి ఏరా బాగున్నావా? అంటూ చిన్ననాటి భాషను ఉపయోగిస్తూ పరామర్శించగా తన వెంట వెళ్లిన పార్టీ శ్రేణులు అవాక్కయ్యా రు.